# దేశాన్ని అభివృద్ధివైపు నడిపించేది ప్రధాని మోడీ : ఎంపి అరుణ



సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఎంపి అరుణ, సారంపాణి తదితరులు

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :** సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్ కాలనీలో బీజేపీ నేతలు సభ్యత్వనమోదు కార్యక్రమం నిర్వహించారు. మేకల కీర్తి, హర్షకిరణ్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమనికి మహబూబ్‌నగర్ ఎంపీ అరుణ, మహంకాళి జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంపాణిలు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఇంటింటికి తిరుగుతూ బీజేపీకి మద్దతును కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో సుపరిపాలన కావాలని మోడీ నాయకత్వంలో వికసిత్ భారత్ నిర్మించాలని, వన్ నేషన్, వన్ ఎలక్షన్ నినాదంతో దేశాన్ని అభివృద్ధి పరచాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వందే వరుణ్, మేకల సుజాత, కనకట్ల హరి, ఆకారం రమేష్, హనుమంతు, అనిత, లావణ్య, నాగరాణి, భాగ్యమ్మ, యాదమ్మ, ఆనంద్, ప్రతాప్, ఖయ్యూం, నాగరాజు, దేవేందర్, నాగేంద్ర, గణేష్, భిక్షపతి, కవిత, సౌజన్య, లతా, మేరి, కావ్య, రెజీనా తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వార్త




నల్లచెరువులో హైడ్రా కూల్చివేసిన ఇళ్లు...(ఇన్‌సెట్ రోదిస్తున్న బాధితులు

# హైడ్రా కూల్చివేత.. బాధితుల విలవిల

**కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త**

తాము అద్దెకు తీసుకుని షెడ్‌లు నిర్మించుకుని వ్యాపారం చేసుకుంటున్నామని, రూపాయి రూపాయి కూడ బెట్టుకుని ఇంత కష్టపడి అద్దెకు తీసుకుని వ్యాపారం చేసుకుంటున్నాము. ఇది ప్రభుత్వానికి న్యాయమా ఇలా చేయడం అద్దెకు ఉండేవాళ్లకు టైమ్ ఇవ్వాలి కదా.. సొంతంగా కట్టుకున్నవాళ్లం కాదు కదా.. మాకేం తెలుసు ఇది చెరువు స్థలంలో ఉందని.. మేము అమాయకులం అంటు బాధితులు బోరున విలపించారు. తాము అద్దెకు తీసుకుని షెడ్లు నిర్మించుకొని వ్యాపారం చేసుకుంటున్నామని అవేదన వ్యక్తం చేశారు. స్థలంయజమానులు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, ఇది ఎఫ్‌టిఎల్‌కిరాదు అంటేనే తాము లక్షలు రూపాయలు వెచ్చించి షెడ్లు నిర్మించుకున్నామని కన్నీరు మున్నీరయ్యారు. హైడ్రా అధికారులు కూల్చివేస్తుండగా బాధితులు బోరున విలపిస్తూ అధికారుల కాళ్లను కూడా పట్టుకున్నారు. నాలుగు రోజులు సమయం ఇస్తే తమ సామనంతా తీసుకెళ్తామని అధికారులను వేడుకున్నారు.

కాగా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కబ్జా జరిగిన చెరువులను రక్షించడానికి ఉద్దేశించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా (హైదరాబాద్ డైజెస్టర్ మేనేజ్ మెంట్ అండ్ అసెట్ ప్రొటెక్షన్) వ్యవస్థ కూకట్‌పల్లి నల్లచెరువుపై ఆదివారం ఉదయం వేకువజామున కూల్చివేతలు చేపట్టింది. గతం నుంచే నల్లచెరువులో పట్టభూములు ఉండడంతో చెరువు చుట్టుపక్కల ఉన్న బఫర్ జోన్‌తో పాటు ఎఫ్‌టిఎల్ పరిధిలోకివచ్చి ఈ మధ్యకాలంలో భారీగా షెడ్లు ఏర్పాటుచేసుకుని వ్యాపార సంస్థలు ఏర్పాటు చేసుకోవడంతో రెండు రోజుల క్రితం హైడ్రా అధికారులు వచ్చి నోటీసులు ఇచ్చి ఆదివారం కూల్చివేతలు చేపట్టడం జరిగింది. కూల్చివేతలసందర్భంలో భారీగా పోలీసులు మోహరించి షెడ్లను కూల్చివేయడం జరిగింది.

ఈ సందర్భంగా భారీగా ఆస్తినష్టం జరిగినట్లు కనిపిస్తుంది. చెరువు మొత్తం 27 ఎకరాలు ఉండగా పట్టభూములలో నిర్మాణాల పేరుతో దాదాపు 7 ఎకరాలలో బఫర్ జోన్, ఎఫ్‌టిఎల్‌లో నిర్మాణాలు చేపట్టడం జరి గింది. ప్రస్తుతం భారీ బిల్డింగ్‌ల కూల్చివేతలు ఆపి షెడ్ల వరకు కూల్చివేతలు చేయడం జరిగింది.

**తీవ్ర ఉద్రిక్తత...**

కూల్చివేతలు జరుగుతున్న సందర్భంలో నిర్మాణదారుల మధ్య అధికారుల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం జరిగింది. మొదటి నుంచి స్థానిక లీడర్ల భరోసాతో నిర్మాణాలు చేసుకున్న స్థానికులు ఇప్పుడు ప్రభుత్వం మారడంతో జరిగిన పరిణామాలతో ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయిన స్థానికులు తమ గోడును మీడియాకు తెలియజేయడం జరిగింది.

ఏది ఏమైనా చెరువుల బఫర్ జోన్‌లో నిర్మాణాలకు ధైర్యం చెప్పింది ఒకరు ప్రస్తుతం జరిగే నష్టాన్ని అనుభవించే వారు ఒకరు అని స్థానికులు బాధను తెలియజేస్తున్నారు. ఒక విధానం లేకుండా కూల్చివేతలు చేపట్టిన హైడ్రా అధికారులు వాస్తవంగా చెరువును రక్షించాలంటే అక్రమంగాఉన్న అన్ని అక్రమ నిర్మాణాలను కూల్చి సమన్యాయం పాటించాలని ప్రజలు కోరుతున్నారు. కూల్చివేతల సందర్భంగా కూకట్‌పల్లి ఏసీపీ రమేస్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న అధికారులు పాల్గొనడం జరిగింది.

# అంతా మా ఇష్టం..?

- * బడా మాల్స్‌లో వ్యాపారుల ఇష్టారాజ్యం
- * అడ్డగోలు ధరలతో వినియోగదారులకు కుచ్చుటోపి
- * పట్టించుకోని తూనికలు కొలతలశాఖ అధికారులు
- * స్టేటస్ సింబల్‌గా భావించి భరిస్తున్న జనం
- * మోసపోతున్నామని తెలిసినా ప్రశ్నించడానికి వెనుకంజ



**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:**

ప్రపంచీకరణ నేపథ్యంలో జీవితం బిజీబిజీగా మారిపోయింది... బిజీ జీవితలో క్షణం ఎంతో విలువైనదిగా మారింది. నిమిషంలో ఏమైన జరగవచ్చు.. ఆ నిమిషంలోనే వెళ్లాల్సిన బస్సు అందకుండా పోతుంది. ఆలస్యం కారణంగా ట్రాఫిక్ జామ్‌లతో పరిస్థితులు గందరగోళంగా మారుతుంటాయి..అందుకే నగరవాసులు ఏవైనా కొనుగోలు చేయాలన్నా.. కాస్తంత ఉల్లాసంగా గడపాలన్నా..సెలవురోజులనే ఎంచుకుంటారు. అదికూడా అన్నీ ఒకే ప్రాంతంలో లభించే వెసులుబాటును కోరుకుంటారు. వారాంతంలో లభించే అవకాశాన్ని వీలైనంత వరకు సద్వినియోగం చేసుకోవాలని చూస్తుంటారు. ఈ క్రమంలోనే అందుబాటులోకి వస్తున్న మాల్స్‌కు ఇటీవల ఆదరణ పెరిగిపోయింది.మాల్స్‌లో ఏర్పాటయ్యే షోరూమ్స్, రెస్టారెంట్లు, మల్టీఫ్లెక్‌లు, గేమింగ్ జోన్స్‌తో వయోభేదం లేకుండా అందరూ రోజంతా ఊరట పొందే అవకాశం కలుగుతుంది. అయితే ఇంత వరకు బాగానే ఉన్నా..వస్తువులు తినబండారాలు. ఇతర సేవలపై వసూలు చేస్తున్న ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. విలాసానికి ప్రతీకగా హైక్ చేస్తూ అందినంత దండుకోవడం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. హైఫైజోన్‌లుగా పరిస్థితులు రూపొందిచిన మాల్స్, మల్టీఫ్లెక్స్‌లు, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ, మాదాపూర్, కొండాపూర్ పంజాగుట్ట తదదితర ప్రాంతాల్లో అనేకంగా ఉన్నాయి. అందులో షాపింగ్ చేసే వారు తాము తీసుకునే వస్తువులకు, ఆహార పదార్థాలకు నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తున్నా...వారిమోసాలను హైఫైగా భావించి భరిస్తుండటం ఇప్పుడు నగరంలో హాట్ టాఫిక్‌గా మారింది. తూనికలు కొలతల అధికారులు ఇటీవల షాపింగ్‌మాల్స్, మల్టీప్లెక్స్‌లలో దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్న సందర్భంలో పలు అంశాలు చర్చకు వస్తున్నాయి. బేకరీలో అమ్మే రూ.25గల కూల్‌డ్రింక్‌కు మల్టీప్లెక్స్‌లో రూ.150 చెల్లించాల్సిన పరిస్థితికి కారణం ఏంటీ..? బయట దుకాణాల్లో 500లకు లభించే షర్టుకు మాల్స్‌లో రూ.2000వేలు ఎందుకు చెల్లించాల్సి వస్తుంది. అందులో కొనేవన్నీ బ్రాండెడ్ వేనా..లేకా అందులో కొనడమే ఒక స్టేటస్‌హా అనే అంశాలను పలువురు వినియోగదారులు చర్చిస్తున్నారు.

**గడువు ముగిసినవే ఆఫర్ల రూపంలో..**

సగటు మనిషి జీవన ప్రయాణం పెరుగుతున్న నేపథ్యంలో నేడు ఎన్నో ఉత్పత్తులు, సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ఆఫీస్ బాయ్ నుండి ఆఫీ సర్ వరకు ఆయా స్థానాలను బట్టి నాణ్యమైన వస్తు, సేవలు వాడేందుకు మొగ్గు చూపుతున్నారు. వినియోగదారుల అవసరాలను గుర్తించిన పలు షాపింగ్‌మాల్స్ ఇంటర్నేషనల్ బ్రాండ్లపేరుతో మోసాలకు పాల్పదుతున్నాయి. అంతర్జాతీయ బ్రాండ్లపేరుతో వినియోగదారులకు నిలువునా దోచేస్తున్నారు. ప్రముఖ సంస్థలకు చెందిన లేబుల్స్, ప్యాకింగ్‌లతో మసిపూసి మారేడు కాయ చేస్తున్నాయి. ముఖ్యంగా బ్రాండ్లపేరుతో ఒరకమైన మోసమైతే.. ఆఫర్ల పేరుతో నగరవాసుల జేబులకుచిల్లుపెడుతున్నారు. కొన్ని షాపింగ్ మాల్స్ ఆఫర్లు అనగానే అందరూ తక్కువ ధరలకే వస్తున్నాయనే భావనలో ఉంటున్నారు. ఆయా సంస్థలు గడువు ముగిసిన ఉత్పత్తులనే ఆఫర్లు ఇస్తుండటంతో కొందరు అమాయక వినియోగదారులు కొనుగోలు చేసి మోసపోతున్నారు.

**అధికారులకు ఒత్తిళ్లు..**

కొన్ని రోజుల క్రితం తూనికలు కొలతల అధికారులు మాల్స్, మల్టీప్లెక్స్‌లో దాడులు నిర్వహిసూన్త కేసులు నమోదు చేశారు.అయినా వారిలో మార్పు రావడంలేదు. ఎందుకంటే అవన్నీ రాజకీయ నాయకులు, వారీ బంధవులకు సంబంధించినవే కావడంతో అధికారులు కూడా చేతులెత్తేస్తున్నారు. ఇటీవల ఓషాపింగ్‌మాల్‌పై రెండవసారి దాడులకు వెళ్లిన తూనికలు,కొలతల అధికారులకు ఓరాజకీయ నాయకుడి నుండి ఒత్తిళ్లు రావడంతో తూతూమంత్రంగానే దాడులు నిర్వహించి ఎలాంట కేసులు నమోదు చేయకుండా వెనుదిరినట్లు సమాచారం.దీంతో బడాషాపింగ్‌మాల్స్‌వైపు తనిఖీలకు వెళ్లాలంటే అధికారులు జంకుతున్నారు.

శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కొవ్వుకలపటానికి వ్యతిరేకంగా

## హిందూ జనజాగృతి సమితి ధర్నా

**సైఫాబాద్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :** కలియుగ దైవం తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపి అపవిత్రం చేసినవారిపై తక్షణమే కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పలు హిందూ సంఘాలు ఆదివారం లిబర్టీ వద్దగల టిటిడి శ్రీవారి దేవాలయం ఎదుట ధర్నా చేపట్టారు. హిందూ జనజాగృతి సమితి రాష్ట్ర సమన్వయకర్త గాడి చేతన్, సినీ నటి కరాటే కళ్యాణి, వివిధ సంఘాల నేతల శ్రీనివాసచారి, మౌనికారెడ్డి, ప్రవీణ్ దూబే తదితరులు మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది శ్రీవారి భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలపటం దారుణమని, ఈ విషయంలో ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినందున నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పదవులలో ఉన్నంత కాలం పవిత్ర లడ్డూ తయారీ కాంట్రాక్ట్‌ను క్రైస్తవ సంస్థలకు ఇవ్వడం ఆలయ నిర్వహణ కమిటీలో క్రైస్తవులను నియమించటం సిగ్గుచేటని నిశితంగా విమ్మంచారు. దేవాలయాల్లో అందించే ప్రసాదం సాత్వికంగా, స్వచ్ఛందంగా, పవిత్రంగా ఉండాలని, దానిని తయారుచేసే, పంపిణీచేసే వారందరు కూడా హిందువులై ఉండాలని, దేవాలయాలను ప్రభుత్వ కబంధ హస్తాల నుంచి విముక్తి చేయాలని టిటిడిలో పనిచేస్తున్న అన్య మతస్తులను వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేశారు.


హిమాయత్‌నగర్‌లోని టిటిడి శ్రీవారి దేవాలయం ఎదుట ధర్నా దృశ్యం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగేశ్వర్

## రాడార్ కేంద్రాన్ని మరో చోటుకు మార్చాలి

ప్రొఫెసర్ నాగేశ్వర్

**ధర్నాచౌక్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:**

వికారాబాద్ జిల్లా పూడూరు సమీపంలోని దామగుండం అటవీ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న రాడార్ కేంద్రాన్ని మరో ప్రాంతానికి తరలించాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కే.నాగేశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో సేవ్ దామగుండం ఫారెస్ట్ అనే నినాదంతో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేసించి ఆయన మాట్లాడుతూ మేము దేశ రక్షణ, దేశాభివృద్ధికి వ్యతిరేకం కాదని, పర్యావరణాన్ని విధ్వంసం చేస్తే మాత్రం చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. రాడార్ నిర్మాణం మూడు వేల ఎకరాల అటవీ ప్రాంతంలో నిర్మాణం చేయటం వల్ల లక్షల సంఖ్యలో వృక్షాలతో పాటు వణ్యప్రాణులకు కూడా నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మూసీనది ప్రారంభమైన ఈ జిల్లాలో నీటితో పాటు జీవ వైవిద్యానికి, పర్యావరణానికి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్నారు. పర్యావరణానికి నష్టం కలుగకుండా రాడార్ కేంద్రాన్ని వేరే ప్రాంతానికి మార్చాలని డిమాండ్ చేశారు. ప్రముఖ సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ధర్నాకు మద్దతు తెలుపుతూ భవిష్యత్ తరాల కోసం ప్రకృతిని, అడవులను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విప్లవ గాయని విమలక్క, పీఓడబ్ల్యు నాయకురాలు సంధ్య, జర్నలిస్ట్ తులసి చందు, దామగుండంకు చెందిన సత్యానంద స్వామి తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దుర్గం రాజేష్, నరసయ్య, దీపక్ తదితరులు

## నేతకాని మహర్లను ఎస్సీ ఏ కేటగిరీలో ఉంచాలి

**హైదరాబాద్, సెప్టెంబరు 22,ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణలో నేతకాని మహర్‌లను ఎస్సీ ఏ కేటగిరిలో ఉంచాలని రాష్ట్ర నేతకాని మహార్ సంఘం ఎస్సీ వర్గీకరణ కమిటీ చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరింది. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర అధ్యక్షులు దుర్గం రాజేష్ ఆధ్వర్యంలో మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నేతకాని మహార్ సంఘం ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు తమ కమ్యూనిటీకి సంబంధించిన డిమాండ్లను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వీటిలో ప్రధానంగా నేతకాని కులాన్ని ఎస్సీ ఏ కేటగిరీలో ఉంచి ఐదుశాతం ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించలాన్నారు. ఎస్సీ జనాభాలో 18నుంచి 20 లక్షల జనాభా కలిగిన నేతకానిలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి తద్వారా అత్యంత వెనకబడిన వారికి ఆర్థిక చేయూత అందించాలన్నారు. అదేవిధంగా నామినేటెడ్ పోస్టుల్లో వాటా కల్పిస్తూ, ఏజెన్సీ ప్రాంతాల్లో వ్యవసాయం చేసుకోవడానికి వీలుగా మూడు ఎకరాల భూములకు పట్టాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈసమావేశంలో సంఘం స్టీరింగ్ కమిటీ చైర్మన్ దుర్గం నరసయ్య, ఛీఫ్ అడ్వైజర్ బర్లకుంట దీపక్, రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ సిగ్గెం రాజేష్, అధికార ప్రతినిధి అనుపర్తి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు పుష్పగుచ్చం అందజేస్తున్న చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్లు

## గడ్డిఅన్నారం మార్కెట్ చైర్మన్‌గా మధుసూదన్‌రెడ్డి

మంత్రి తుమ్మలను సత్కరించిన నూతన పాలకమండలి

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:** రాష్ట్రంలోనే అతి పెద్ద మార్కెట్ గడ్డిఅన్నారం వ్యవసాయ (పండ్లు)మార్కెట్ చైర్‌పర్సన్‌గా చిలుక మధుసూదన్‌రెడ్డి నియామకం అయ్యారు. మార్కెట్ నూతన పాలకమండలి నియామకం అయిన సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిలను వారి కార్యాలయాలలో గడ్డిఅన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి నేతృత్వంలో శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాలను అందజేశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ గడ్డిఅన్నారం మార్కెట్ పూర్వవైభవం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తాము పనిచేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ సిహెచ్.బాస్కరచారి, పాలకమండలి సభ్యులు బండి మధుసూదన్‌రావు, జైపాల్‌రెడ్డి, అంజయ్య, మేకం లక్ష్మి, మచ్చేందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, గణేష్‌నాయక్, నరసింహ, నవరాజ్, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌గుప్త, ఇబ్రహీం పాల్గొన్నారు.

# పర్యాటక ప్రాంతాలకు ప్రాచుర్యం కల్పించండి

## యువతకు మంత్రి జూపల్లి పిలుపు

**బేగంపేట, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :**

తెలంగాణా రాష్ట్ర పర్యాటక ప్రమోషన్‌లో భాగస్వాములు కావాలని మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపు నిచ్చారు.ఆదివారం బేగంపేట టూరిజం ప్లాజా నుంచి తార్నాకవరకు బైకర్లతో కల్సి మంత్రి జూపల్లి కృష్ణారావు బైక్ రైడ్ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ యువకులు పర్యాటక ప్రాంతాలను సందర్శించి వాటికి ప్రాచుర్యం కల్పించాలని కోరారు.బుద్దుడి బోధనలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు.రైడ్ టూ నిర్వహణ బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించి వారితో కల్సి బైక్ నడిపి యువతలో జోష్ నింపారు.హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్ బుద్దవనంవరకు ప్రారంభమైన బైక్ ర్యాలీని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. తెలంగాణా పర్యాటక అభివృద్ధి సంస్థ, హైదరాబాద్ బైక్ రైడర్లు సంయుక్తంగా నిర్వహించిన బైక్ ర్యాలీ పెద్ద ఎత్తున సాగింది. అంతర్జాతీయ పర్యాటక వారోత్సవాలలో భాగంగా నాగార్జున సాగర్ బుద్ధవనం థీమ్‌పార్కు వరకు ప్రమోషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,ఎండీ ప్రకాష్‌రెడ్డి బైకర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు.

# నదులు, జలాశయాల సంరక్షణ బాధ్యత ప్రతిఒక్కరిదీ

-ఇంటాక్ జాతీయ పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ వేదకుమర్

**హైదరాబాద్, సెప్టెంబరు 22,ప్రభాతవార్త:**

నదులు, జలాశయాలను సంరక్షించాల్సిన ప్రతి ఒక్కరిదని ఇంటాక్ జాతీయ పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ వేదకుమర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ప్రపంచ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫోరం ఫర్ బెటర్ హైదాబాద్, దక్కన్ హెరిటేజ్ అకాడమీ వివిధ కళాశాలలు, స్కూళ్ల భాగస్వామ్యంతో మేడ్చల్ జిల్లా శామీర్‌పేట్ లేక్ అవుట్‌ఫ్లో సదరన్‌బండ్ వద్ద వాక్ నిర్వహించారు. ప్రొ. వేదకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ ట్రైబల్ మ్యూజియం డైరెక్టర్ ద్యావనపల్లి సత్యనారయణ, శామీర్‌పేట్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ రవీంద్రారెడ్డి, వాటర్ హార్వెస్టింగ్ నిపుణులు సుభాష్‌రెడ్డి, పర్యావరణ వేత్త నరహరిలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వేదకుమార్ మాట్లాడుతూ ప్రపంచ నదుల దినోత్సవాన్ని ఏటా నిర్వహిస్తామని ఈసారి శామీర్‌పేట్‌లో ఆకార్యక్రమాన్ని నిర్వహించాన్నారు. నదలు పరిరక్షణ, శుభ్రత మనందరి బాధ్యత అని ఉద్ఘాటించారు. ప్రపంచ కాలుష్యం నుంచి నదులు, జలవనరులను పరిరక్షించే బాధ్యతను ప్రభుత్వం మాత్రమే కాదని, పౌరసమాజం, సంస్థలు,యువత సైతం తీసుకోవాలన్నారు. శామీర్‌పేట్ సరస్సు ప్రాముఖ్యతను వివరిస్తూ 6వ నిజాం మెహబూబ్ అలీపాషా హైదరాబాద్ చుట్టుపక్కల ఉత్తమ సూర్యాస్తమం ప్రదేశంగా ఈసరస్సును ఎంపిక చేశారని తెలిపారు. ప్రపంచ నలుమూలలనుంచి హైదరాబాద్ పర్యటనకు వచ్చే అతిధుల మధ్య ఈసరస్సును ప్రాచుర్యం పెంపొందిందన్నారు. ద్యానవల్లి సత్యనారాయణ కృష్ణాగోదావరి నదీ పరివాహక ప్రాంత సంస్కృతి గురించి, తాగు, సాగుకు నదీజలాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ అందరినీ ఆకుట్టుకుంది.కార్యక్రమంలో ఎఫ్‌బిహెచ్ ప్రధాన కార్యదర్శి శోభాసింగ్, కోఆర్డినేటర్ కట్టా ప్రభాకర్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేదకుమార్




## పేదల సమస్యలపై పోరాటం చేయాలి:చంద్రమోహన్

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:** పేదల సమస్యలపై నిరంతర పోరాటం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్, జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి పేర్కొన్నారు. ఎన్టీఆర్‌నగర్ 5వశాఖ మహాసభ జరిగిన సందర్బంగా ఎన్టీఆర్‌నగర్‌లో పార్టీ జండాను ఎగరావేసి మహాసభను నిర్వహించారు. ఈసందర్బంగా ఎన్టీఆర్‌నగర్‌శాఖ కార్యదర్శిగా ఎం.గోపినాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ప్రభుత్వలపై పోరాటం చేస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీయం సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి సిహెచ్.వెంకన్న, కార్యదర్శి వర్గసభ్యులు కట్ట శ్రీనివాస్, యం.వీరయ్య, బి.రాజు, యం.పద్మ, రావూరి వెంకన్న, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## గోరక్షణ మహా పాదయాత్ర




**గన్‌ఫౌండ్రి, సెప్టెంబర్ 22ప్రభాతవార్త:** భూరక్షణ,పర్యావరణ రక్షణ కోసం గోరక్ష మహా పాదయాత్రను తలపెట్టినట్లు అఖిలభారత గో సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలకృష్ణ గురుస్వామి తెలిపారు. బషీర్‌బాగ్‌లోని అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుంగనూర్ ఆవుతో కలిసి హిమాయత్‌నగర్‌లోని టిటిడి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు తలపెట్టిన ఈ మహా పాదయాత్ర ఈనెల 27వ తేది నుండి జమ్ముకాశ్మీర్‌లోని శ్రీశంకరాచార్య ఆలయంలో ప్రత్యేక హోమంతో ప్రారంభవుతుందన్నారు. 14 రాష్ట్రాల మీదుగా ఆరునెలలపాటు 4900 కిలోమీటర్ల పాదయాత్ర కొనసాగుతుందన్నారు. గోవుతోపాటు, గోవుల రక్షణ, పర్యావరణానికి కలిగే లాభాలను వివరిస్తూ ప్రజల్లోచైతన్యం తీసుకువస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం గోవును జాతీయ జంతువుగా ప్రకటిస్తే గోహత్యలు ఆగిపోతాయన్నారు.లవ్‌ఫార్ కౌ ఫౌండేషన్ చైర్మన్ జస్మత్‌బాయపటేల్, దేశంలో గోవులు హత్యలు పెరిగిపోయినట్లు చెప్పారు. గోవును జాతీయ ప్రాణిగా ప్రకటిస్తే దేశం పాడి పంటలతో మరింత అభివృద్ది చెందుతుందన్నారు.ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆలిండియా థాల్‌సేన పోటీలలో ఎన్‌సిసి ఎపి తెలంగాణ డైరెక్టరేట్ల అద్భుత ప్రతిభ


అభినందిస్తున్న ఎయిర్‌కమాండర్, ఎన్‌సిసి డిప్యూటీ డైరెక్టర్ జనరల్

**చిక్కడపల్లి, సెప్టెంబరు 22 ప్రభాతవార్త :** ఎంతో ప్రతిష్టాత్మకమైన ఆలిండియా థాల్‌సేన బాలికల పోటీలలో ఎన్‌సిసి డైరెక్టరేట్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తమసత్తా చాటింది. న్యూఢిల్లీలో జరిగిన పోటీలలో 91 మంది కెడెట్లతో కూడిన పోటీదారులు అద్భుతమైన ప్రదర్శన నిర్వహించి ఆలిం డియా థాల్‌సేన బాలికల విభాగంలో దేశంలోని ఇతర ఎన్‌సిసి డైరెక్టరేట్‌లకు గట్టిపోటీ ఇచ్చి మొదటి స్థానాన్ని సాధించడంతో పాటు రెండు ఆలిండియా ట్రోఫీలు, 10 బంగారు పతకాలు, 9 మంది రజత పతకాలు, 9 కాంస్య పతకాలను గెలుచుకుంది. టిఎస్‌సి బాలుర బృందం అఖిలభారత పోటీలలో నాల్గవ స్థానం సాధించింది. 17 డైరెక్టరేట్ బృందాలు పోటీపడగా మొత్తంమీద ఎపి, తెలంగాణ జట్లు రెండవస్థానంలో నిలిచారు. హెల్త్ అండ్ హైజిన్ పోటీల్లో మ్యాప్ రీడింగ్ పోటీలలో బాలికలు, బాలుర జట్లు వరుసగా మొదటిస్థానం సాధించాయి. షూటింగ్ పోటీలో జూనియర్ విభాగానికి చెందిన కెడెట్ హన్షిత వ్యక్తిగత స్వర్ణపతాకాన్ని, సీనియర్ విభాగానికి చెందిన కెడెట్ సాయిచంద్ కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. ఎయిర్ కమాండర్, ఎన్‌సిసి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వి.ఎం.రెడ్డి గెలుపొందిన వారిని ఉద్దేశించి ప్రసంగించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కెడెట్లు పాల్గొని అద్భుతమైన ప్రదర్శన నిర్వహించారన్నారు. ఈ రెండు రాష్ట్రాలకు చెందిన అధికారులు ఖచ్చితమైన శిక్షణా నియమావళి, అత్యుత్తమ ప్రతిభకు ప్రతిబిం భిస్తుందన్నారు. టిఎస్‌సి శిక్షణ బృందంలోని అధికా రులు, సిబ్బందిని అభినందించి సత్కరించారు.

## బతుకమ్మ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

**నిజాంపేట్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడే విధంగా నిజాంపేట్‌లోని శ్రీనివాస్ నగర్ నందు స్ఫూర్తి ఉమెన్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ప్రతీయేటా నిర్వహించే బతుకమ్మ వేడుకల పోస్టర్‌ను ఆదివారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, నిజాంపేట్ కార్పొరేషన్ రాఘవేందర్‌రావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పువ్వులలో అమ్మవారిని చూస్తూ మహిళలంతా ఒకదగ్గర చేరి ఐక్యమత్యంగా ఆటలాడుతూ అమ్మవారిని కొలుస్తూ ఆడిపాడే వేడుక బతుకమ్మ అని అన్నారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఉమెన్స్ గ్రూప్ అధ్యక్షురాలు కొడారి రమాదేవి, ఉమాదేవి, శివకుమారి, గీత, పల్లవి, రమాదేవి, మంజుల, యశస్విని, రాజేశ్వరి, చందు, లక్ష్మీ, భాగ్యశ్రీ పాల్గొన్నారు.

## చెరువులను సుందరీకరిస్తుంటే చెత్త వేస్తారా?
### వ్యాన్ డ్రైవర్‌ను మందలించిన సబితారెడ్డి

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:** నగర శివార్లలోని మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని చెరువులను సుందరీకరిస్తూ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే విధంగా తీర్చిదిద్దుతుంటే చెరువుకట్టలపై చెత్తాచెదారాం వేస్తారా? అంటూ స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆదివారం నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పర్యటిస్తూ స్థానిక పెద్దచెరువుకట్టమీద నుండి ఎమ్మెల్యే కాన్వాయ్ వెళ్తున్న సమయంలోనే ఓ ప్రైవేటు వ్యానులో చెత్తా చెదారాన్ని తీసుకొచ్చి డ్రైవర్ పారబోసే యత్నం చేస్తుండగా ఎమ్మెల్యే గమనించారు. ఆమె వాహనం నుండి దిగి చెత్త పారబోయడానికి వచ్చిన వ్యక్తిని మందలించారు. చెరువులను సుందరీకరణ చేస్తుంటే ఇదేమిపద్ధతి అంటూ ఆమె అసహనంవ్యక్తంచేసి చెత్తను డంపింగ్ యార్డులో వేయాలంటూ మందలించి అక్కడి నుండి పంపారు.

# రక్తదానం ప్రాణదానమే : ఎంపి ఈటల

**మెహిదీపట్నం, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** రక్తదానం అనేది ప్రాణదానంలాంటిదని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. ఒకరి రక్తాన్ని మరొకరికి ఇచ్చే పద్ధతిని రక్తదానమంటారు. భారత ప్రధాని నరేంద్రమోదీ 74వ జన్మదినం సందర్బంగా బిజెపి తలపెట్టిన సేవా పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా ఆపార్టీ కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవర శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం గుడిమల్కాపూర్ తాళ్ళగడ్డ రాజలింగయ్య కబడ్డీ స్టేడియం వద్ద మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ఎంపీ ఈటెల రాజేందర్, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల ప్రేమేందర్ రెడ్డి హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానంతో ఇతరుల ప్రాణాలను కాపాడవచ్చాన్నారు. మరొకరి అవసరానికి రక్తాన్ని వాడాలనుకున్నప్పుడు దాత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తాన్ని దానం చేసి ఇతరుల ప్రాణాలను కాపాడుతారన్నారు. రక్తదానాన్ని వ్యాపార దృష్టితో చూడకూడదన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో దేశం ఎంతో అభివృద్ధి సాదిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి చేపట్టిన సభ్యనమోదు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. పాత పట్టణంలో బిజెపి విజయం సాదించనప్పటికి నాయకులు, కార్యకర్తల కృషితోనే పార్టీ బలంగా ఉందన్నారు. అనంతరం రక్తదానంలో పాల్గొన్న వారిని అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు గూనేటి కిరణ్, గోల్కొండ జిల్లా అధ్యక్షులు ఉప్పల పాండుయాదవ్ నాయకులు ఇంద్రసేనారెడ్డి, అమర్ సింగ్, బోడి అశోక్‌కుమార్‌యాదవ్, అన్నూయాదవ్, వి. భుజేందర్‌కుమార్, దేవర వంశీ, కట్ల అశోక్, కట్ట నర్సింగ్‌రావు, శ్రీకాంత్‌సాగర్, సందేశ్ యాదవ్, సుధాకర్‌యాదవ్, నామ యాదగిరినేత, రక్షిత్, ముఖేష్, గోద లక్ష్మీకాంత్ యాదవ్, గంజి రఘునాథ్, ప్రభుపూజారి కార్యకర్తలు పాల్గొన్నారు.





కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వడ్లమూరి కృష్ణస్వరూప్ తదితరులు

### ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా
## 30న సచివాలయం ముట్టడి

**సైఫాబాద్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :** ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రీమిలేయర్‌కు వ్యతిరేకంగా ఈ నెల 30వ తేదీన సచివాలయం ఎదుట పెద్దఎత్తున నిరసన, ఆందోళన, ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నామని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ హెచ్చరించారు. ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఈ ముట్టడికి సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పును రద్దు చేయాలని వర్గీకరణ, క్రీమిలేయర్ అమలు కోసం ఏర్పాటు చేసిన ఉత్తమకుమార్‌రెడ్డి మంత్రుల కమిటీని కూడా రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళితులను రాజ్యాధికారంలోకి రానీయకుండా అడ్డుకోవడం కోసమే వర్గీకరణ క్రీమిలేయర్ పేరుతో దళిత జాతులపై సామాజిక దాడి చేస్తున్నారని ఆరోపించారు. గత పదేళ్లుగా ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక అభివృద్ధి నిధులు రూ. 2లక్షల కోట్లను ఈ మనువాద పాలకులు దోచుకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వారాల భాస్కర్, బేగరి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

### బడంగ్‌పేట్‌లో ఎపి మాజీ సిఎం జగన్ దిష్టిబొమ్మ దహనం

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:** ఎపిలోని గత వైఎస్‌ఆర్‌సిపి పాలనలో తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం కల్తీ అయి కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్న వైనంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి, బిజెవైఎం నాయకులు మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్పొరేషన్ యువమోర్చా అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జగన్‌కు, వైఎస్‌ఆర్‌సిపికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మను తగులబెట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి నాయకులు సామ సంజీవరెడ్డి, నడికుడ యాదగిరి, జిల్లా నాయకుడు గుర్రం మల్లారెడ్డితో పాటు యెల్మేటి దేవేందర్‌రెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నవారు శ్రీనివాస్‌రెడ్డి, మోర లోకం, మంత్రి మహేష్ ముదిరాజ్, చిత్రం శ్రీనివాస్, నిమ్మల రవికాంత్‌గౌడ్ తదితరులతో పాటు పలు హిందు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### భారీ వర్షానికి కూలిపడిన భారీ వృక్షం

**నార్సింగి, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :** బండ్లగూడ కార్పొరేషన్ పరిధిలోని పి అండ్ టి కాలనీలో శనివారం రాత్రి కురిసిన గాలివానకు భారీ వృక్షం రోడ్డుపై కూలిపోయింది. దీంతోపాటు 11.విద్యుత్ స్థంభాలు కూలిపడి రాకపోకలు, కరెంటు సరఫరా నిలిచిపోయింది. సన్‌సిటీ, పిఅండ్‌టీ కాలనీ, నర్సారెడ్డి కాలనీ, రాధానగర్ కాలనీ ప్రాంతాలు హిమాయత్ సాగర్ సెక్షన్, కిస్మత్‌పూర్ సెక్షన్ల పరిధిలోని ప్రాంతాలు అంధకారంగా మారాయి. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది ఈ విషయంను పై అధికారులకు తెలిపారు. విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ ఆనంద్, సూపరింటెండెంట్ ఇంజనీర్ రామ్‌మోహన్, డిఇ రత్నాకర్‌రావ్, ఏడిఇ సత్యనారాయణలు వెంటనే స్పందించి 10.మంది సిబ్బందిని పంపించి భారీ వృక్షంను తొలగించారు. రోజంతా కష్టపడి విద్యుత్ సరఫరాను పునరుద్దరించారు. సుమారు పది లక్షల వరకు విద్యుత్ శాఖకు నష్టం వచ్చిందని అధికారులు తెలిపారు.


రోడ్డుపై పడిన భారీ వృక్షాన్ని తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది


ఉపాధ్యాయులకు పురస్కారం అందిస్తున్న శరత్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్

## విద్యావ్యవస్థలో మార్పు రావాలి : శ్రీనివాస్

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** నైపుణ్యత ఉంటే ఏరంగంలోనైనా రాణించచ్చునని యాదవ మహాసభ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో యాదవ్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో యాదవ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యావ్యవస్థలో మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఎంబిఏ చదివిన విద్యార్ధి నేడు ఇంగ్లీష్ పేపర్ చదవలేని స్థితిలో ఉన్నారన్నారు. కావున మనం ఏరంగంలో ఉన్నా నైపుణ్యత సాధిస్తే అది మనవిజయానికి ఉపయోగపడుతుందన్నారు. యాదవ్స్ సేవా సంఘం అధ్యక్షులు ఎ.శరత్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 50మంది ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేగల శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శి అరుణ్‌యాదవ్, సంఘం రాష్ట్ర కన్వీనర్ రవి చంద్రయాదవ్, జితేంద్ర యాదవ్, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వకర్మ యజ్ఞం

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ చప్పిడి అడివిరెడ్డి గార్డెన్స్‌లో ఆదివారం విశ్వకర్మ మహాయజ్ఞం ఘనంగా జరిగింది. విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, జాతీయ బిసి కమిషన్ మాజీసభ్యుడు ఆచారి తదితరులు యజ్ఞపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం జిల్లా నాయకుడు, మీర్‌పేట్ కార్పొరేటర్ పసునూరి బిక్షపతిచారి, బడంగ్‌పేట్ కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, మాజీ సర్పంచ్ రామిడి రాంరెడ్డి, పలువురు నాయకులు, విశ్వకర్మీయులు పాల్గొన్నారు.

## ప్రజలు పరిశుభ్రతను పాటించాలి : వందన

**నార్సింగి, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :** ప్రజలంతా పరిశుభ్రతను స్వచ్ఛందంగా పాటించాలని మణికొండ మున్సిపాలిటీ నాలుగో వార్డు కౌన్సిలర్ వందన నాగేష్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని హుడాకాలనీ అంబేదర్కర్ పార్కులో స్వచ్ఛతా హీ సేవా-2024 కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వందన మాట్లాడుతూ ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను రోడ్లపై వేయవద్దని, ఆటోల్లో వేయాలని, తడి,పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని సూచించారు. ఇళ్లు, ఇంటి పరిసరాలలో నీరు, చెత్త నిలువ ఉంటే ఈగలు, దోమలు వృద్ధి చెంది అంటు వ్యాధులను వ్యాపింపచేస్తాయని హెచ్చరించారు. పరిశుభ్రతను పాటిస్తూ, సీజన్‌ల పళ్లను తీసుకుంటే 90.శాతం వరకు వ్యాధులకు దూరంగా జీవించవచ్చన్నారు. ఆదాయార్జనకు రోజూ పది గంటల పాటు పని చేస్తున్నామని, అలాగే ఆరోగ్యార్జన కోసం రోజులో ఒక గంట సమయంను వాకింగ్, ఆసనాలు, యోగ, ప్రాణాయామం వంటి వాటికి కేటాయించాలని సూచించారు. యాంత్రిక జీవనానికి అలవాటు పడి ప్రాకృతిక జీవనానికి దూరం అవుతున్నామని, అందుకే మనం వ్యాధులకు దగ్గరవుతున్నామన్నారు. ఒక్క మనిషి తప్పా సృష్టిలోని ఇతర ప్రాణులన్నీ ప్రకృతిసిద్ధంగా జీవిస్తున్నాయని, అందుకే అవి ఆసుపత్రి మొహం చూడకుండా జీవనం సాగిస్తున్నాయని, మనిషి తినే తిండి, పీల్చే గాలీ, భూమి ఇలా అన్నింటిని కల్తీ చేసుకొని అనారోగ్యాలపాలవుతూ, ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నాడన్నారు. అనంతరం అంబేద్కర్ పార్క్‌ను పారిశుద్యం కార్మికులతో శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు వెంకటేశ్వరరావ్, ఎర్రన్న, లింగంగౌడ్, శ్యామ్, సూపర్ వైజర్ సాజిద్ తదితరులు పాల్గొన్నారు.


పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ వందన నాగేష్ యాదవ్

# వైభవంగా రథ యాత్ర నగర సంకీర్తన ఊరేగింపు

**యాకుత్‌పుర, సెప్టెంబరు 22 ప్రభాతవార్త :** పాతబస్తీ దివాన్‌దేవిడిలోఉన్న శ్రీచైతన్య గౌడియ మఠం వార్షికోత్సవాలు సందర్బంగా ఆదివారం హైదరాబాద్ పాతబస్తీలో అత్యంత వైభవంగా రథ యాత్ర,నగర సంకీర్తన కార్యక్రమం జరిగింది. రథ యాత్రను సుందరంగా అలంకరించి రథంపై భగవాన్ శ్రీచైతన్య మహాప్రభు, భగవాన్ శ్రీరాధాకృష్ణ విగ్రహాలను ఉంచి ఊరేగింపు నిర్వహించారు. దివాన్‌దేవిడిలోని శ్రీ చైతన్య గౌడియా మఠం నుంచి ప్రారంభమైన రథయాత్ర, నగర సంకీర్తన ఊరేగింపు మదీనా, పత్తర్‌గట్టి, గుల్జారాహౌస్, రికాబ్ గంజ్, అగర్వాల్ కళాశాల ప్రాంతాలు మీదుగా కొనసాగిన అనంతరం తిరిగి మందిరానికి చేరుకుంది. పాతబస్తీలో జరిగిన రథయాత్ర సందర్బంగా చార్మినార్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య గౌడియా మఠం రక్షకులు, కార్యదర్శి భక్తి సాధ జితేంద్రియ, పంజాబ్‌కు చెందిన స్వామి పరమ హంస మహారాజ్,ఢిల్లీకి చెందిన స్వామి నరసింహ మహారాజ్,శ్రీ రామ్ ప్రకాష్,శ్రీ విష్ణు గోపాల్, రాజేష్‌తోపాటు వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. కాగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ దంపతులు శనివారం రాత్రి దివాన్‌దేవిడిలోని శ్రీ చైతన్య గౌడియా మఠంను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 19వ తేదీన ప్రారంభమైన శ్రీ చైతన్య గౌడియ మఠం వార్షికోత్సవాలు ఆదివారంతో వైభవంగా ముగిసాయి.


ఊరేగింపులో పాల్గొన్న దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహరాజ్‌లు




## ఘనంగా ప్రారంభమైన ఖోఖో క్రీడలు..

**నిజాంపేట్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** ఆదివారం జరిగిన ఖోఖో పోటీల సమావేశంలో అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి.సత్యనారాయణ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఆటలు అంటే ఒక్క ఖోఖోనే కాదు, అన్ని ఆటలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ శారీరక దృఢ సంకల్పంతోపాటు, మానసిక దృఢసంకల్పం కూడా అలవరుచుకోవాలని చెప్పారు.

**విఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి స్కూల్ ఆధ్వర్యంలో ఖోఖో టోర్నమెంట్‌కు ఆతిథ్యం**

సీబీఎస్ఈ ఖోఖో టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇవ్వడం గర్వంగా భావిస్తున్నామని బాచుపల్లి విఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి స్కూల్ యాజమాన్యం తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని 200 సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొనే ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో సుమారు 5,500 మంది క్రీడాకారులు అండర్ 14, అండర్ 17, అండర్ 19 బాలురు, బాలికల విభాగాల్లో పోటీపడతారని, ఈ టోర్నమెంట్ 2024 సెప్టెంబర్ 22 నుండి 25 వరకు జరుగుతుందని తెలిపారు. ఈ క్రీడా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సైబరాబాద్‌లోని బాలానగర్ జోన్ అదనపు పోలీస్ డిప్యూటీ కమీషనర్ పి.సత్యనారాయణ, సైబరాబాద్ బాలానగర్ జోన్ అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ జి.హనుమంతరావు, ఆసియా ఖోఖో బంగారు పతక విజేత ప్రమోద్ థోరాట్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుండి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొనడం క్రీడాస్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. విఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి ట్రస్టీ సభ్యులు వల్లూరుపల్లి రాజా రామమోహన్ రావు, వల్లూరుపల్లి రాజశేఖర్, డాక్టర్ వల్లూరుపల్లి గీత, వల్లూరుపల్లి రాజ్ కుమార్, వల్లూరుపల్లి రమణ ఈ కార్యక్రమంలో పాల్గొని తిలకించారు. ఎన్‌సిసి క్యాడెట్ల ఉత్సాహభరితమైన మార్చ్‌పాస్ట్, ఒలింపిక్ టార్స్ కార్యక్రమాలు విద్యార్థుల చేతుల మీదుగా నిర్వహించబడ్డాయి. వీరి లో వేదకృతి, జి.వి.నిషిత, విభవ్, దర్శన్, క్యాడెట్ ధీరజ్‌లు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ కొడాలి విజయరాణి క్లస్టర్ 7 ఖోఖో మీట్ 2024-25ను అధికారికంగా ప్రకటించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద

**పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. ఆదివారం పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యే కెపి వివేకానందని కలసి పలు ఆహ్వానాలు, వినతిపత్రాలు అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వివేకానంద నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో నెలకొని ఉన్న సమస్యలు త్వరితగతిన పూర్తి చేసి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

## 'ఈత'ను పాఠ్యాంశంలో చేర్చాలి : రవీందర్

**పేట్ బషీరాబాద్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** ఈత ఒక సాదనంగా పాఠ్యాంశంలో చేర్చాలని ఆదివారం సామాజిక, ప్రకృతి ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ మేడ్చల్ మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతోపాటు ఈతలలో నైపుణ్యం కలిగి ఉండటం ఎంతో మంచిదన్నారు. ఈతరాక ఎంతోమంది విద్యార్థులు నీటి ప్రమాదంతో మృత్యువాత పడుతున్నారని తెలిపారు. తెలుగు రాష్ట్రాలలో ప్రతి సంవత్సరం 1000 నుంచి 1500 మంది వరకు విద్యార్థులు చనిపోవడం విచారకరమన్నారు. దేశవ్యాప్తంగా 50 నుంచి 60వేల మంది విద్యార్థులు నీటిలో మునిగి ఈతరాక చనిపోతున్నారని అన్నారు. ఈతలో అనుభవం ఉన్న విద్యార్థులకు 3 నుంచి 10వ తరగతి వరకు సోషల్, సైన్స్‌లో రెండు మార్కులు అదనంగా కలపాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి ఈ నా పోరాటం ప్రయత్నంలో గత 15 ఏండ్లుగా దివంగత మాజీ సీఎం వైయస్సార్, తెలంగాణ మాజీ సీఎం కెసిఆర్‌లకు పలుమార్లు ఇన్నవిచడం, వినతిపత్రాలు అందజేయడం జరిగిందన్నారు. అప్పుడు కార్యచరణకు నోచుకోని ఈత సమస్యను ఇప్పుడైనా తమరు ఎంపీగా మా కల నెరవేర్చేందుకు కృషి చేయాలని కోరారు.

## జొన్నాడ రాకేష్ కుమార్ మృతి బాధాకరం
### సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోట నీలిమ


రాకేష్ కుమార్ భౌతిక కాయం వద్ద నివాళులు అర్పిస్తున్న కోట నీలిమ

**బేగంపేట సెప్టెంబరు 22,ప్రభాతవార్త :** రామ్‌గోపాల్‌పేట డివిజన్ కాంగ్రెస్ నాయకుడు జొన్నాడ రాకేష్ కుమార్ (36) కిడ్నీలు ఫెయిల్ అయి అకాల మరణం చెందాడన్న విషయం తెల్సుకున్న సనత్‌నగర్ నియోజకవర్గం ఇంచార్జి డా.కోట నీలిమ ఆదివారం రాంగోపాల్‌పేట డివిజన్ లోని జొన్నాడ రాకేష్‌కుమార్ నివాసానికి వెళ్లి ఆయన పార్థివదేహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ జొన్నాడ రామలింగం కుమారుడు రాకేష్‌కుమార్ మృతి ఎంతో బాధ కల్గించిందని,వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. కార్యక్రమంలో సనత్‌నగర్ నియోజకవర్గం ఏ బ్లాక్ ప్రెసిడెంట్ త్రికాల మనోజ్‌కుమార్ ముదిరాజ్,చందు,చక్రం,మహేష్,కృష్ణ,టింకు తదితరులు ఉన్నారు.

## అదృశ్యమైన బాలికను తల్లి వద్దకు చేర్చిన పోలీసులు

**ముషీరాబాద్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** ఈనెల 20న ఇంటి నుండి చెప్పకుండా వెళ్లిపోయిన బాలికను ముషీరాబాద్ పోలీసులు తల్లి వద్దకు చేర్చారు. ముషీరాబాద్ ఎస్‌హెచ్ఓ రాంబాబు కథనం ప్రకారం ఈనెల 20న తల్లి మందలించటంతో వైష్ణవి(17) కనిపించకుండా పోవటంతో తల్లి శ్రీదేవి ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదుచేసి, దర్యాప్తు ప్రారంభించిన ముషీరాబాద్ పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంతో వైష్ణవి సుల్తాన్‌బజార్‌లోని తన స్నేహితురాలి ఇంట్లో ఉందని కనుగొన్నారు. ఆదివారం వైష్ణవిని క్షేమంగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి, తల్లికి అప్పగించినట్లు సీఐ తెలిపారు.



బాలికను తల్లికి అప్పగిస్తున్న ముషీరాబాద్ పోలీసులు

## కేంద్రమంత్రి మాండవియాను కలిసిన మల్లేశ

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త:** కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలశాఖ మంత్రి డాక్టర్ మున్సుఖ్ మాండవియాను అనురాగ్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ చెన్నకేశ్ మల్లేశ కలిశారు. హైదరాబాద్‌లోని మేగంపేట్ ప్లాజాలో కేంద్రమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా మల్లేశ ఏయూలో నిర్వహిస్తున్న వివిధ ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల స్థూల దృష్టిని అందించారు. సామాజిక అభివృద్ధి, సేవా కార్యక్రమాలను ప్రోత్సహించడంలో యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ చురుకైన భాగస్వామ్యం, అంకితభావాన్ని ఆయన తెలియజేశారు. యువతలో సామాజిక భాధ్యతను పెంపొందించడంలో వారి నిబద్ధతను ప్రదర్శిస్తూ ప్రోగ్రామ్ అధికారులు, వాలంటీర్లుకు యాజమాన్యం యొక్క ఉత్సాహభరితమైన మద్దతును పేర్కొన్నారు.

## శామీర్‌పేట లేక్ వద్ద వాకింగ్



శామీర్‌పేట లేక్ వద్ద వాకింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

**శామీర్‌పేట, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** ప్రపంచ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ సహకారంతో సివిల్ సొసైటీ గ్రూపులు, ప్రభుత్వ సిటీ కళాశాల, దక్కన్ హెరిటేజ్ అకాడమీ, జేబీఆర్ ఆర్కిటెక్చర్ కళాశాల, సెయింట్ పాట్రిక్స్ హైస్కూల్, హిమాయత్‌నగర్లోని ఆక్స్ఫర్డ్ గ్రామర్ స్కూల్, శ్రీ సాయి విద్యానికేతన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఆదివారం శామీర్‌పేట లేక్ అవుట్ ఫ్లో ఒడ్డున వాకింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటాక్ జాతీయ పాలక మండలి సభ్యుడు ప్రొఫెసర్ వేద కుమార్ మణికొండ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ట్రైబల్ మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ ద్యావనవల్లి సత్యనారాయణ, శామీర్‌పేట పరిరక్షణ కమిటీ కన్వీనర్ రవీంద్రారెడ్డి, వాటర్ హర్వెస్టింగ్ నిపుణుడు సుభాష్‌రెడ్డి, ఎఫ్‌బీహెచ్ సభ్యుడు నరహరి, పర్యావరణ వేత్తలు, పాఠశాల యాజమాన్య సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం..

**సంజీవ్‌రెడ్డి నగర్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త**

ఎస్సార్‌నగర్ ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి గత రెండు మూడు రోజులుగా బాగా మధ్యం సేవించి బ్లూస్టార్ హోటల్ ఏరియాలో ఫుట్‌పాత్‌పై పడుకొంటూ ఆదివారం ఉదయం చనిపోయాడని వయసు సుమారు 30 సంవత్సరాలు ఉండవచ్చని తెలిపారు. చనిపోయిన వ్యక్తి బ్లూ ఫ్యాంట్, గీతలున్న తెల్ల చొక్కా ధరించినట్లు తెలిపారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే ఎస్సార్‌నగర్ పోలీసులను ఆశ్రయించాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ తెలిపారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** అర్హులైన ప్రతి పేదవాడు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు , జూబ్లీహిల్స్ శాసన సభ్యులు మాగంటి గోపినాథ్ అన్నారు. ఆదివారం బోరబండ సైట్ 3 వీకర్‌సెక్షన్ కాలనీలో ఏడు మందికి సిఎమ్ఆర్ఎమ్ చెక్కులను అందజేశారు. అదేవిధంగా రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలోని కార్మిక నగర్ చౌరస్తాలో 8మందికి సిఎమ్ఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈకార్యక్రమంలో కృష్ణమోహన్, విజయ్‌కుమార్, బాబురావు, రమేష్ యాదవ్, చోటు, బషీర్, వినోద్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో ఘనంగా విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ వేడుకలు

**ఉప్పల్, సెప్టెంబరు 22 ప్రభాతవార్త :** విశ్వకర్మలకు కేంద్ర ప్రభుత్వం తగు చేయూత అందిస్తుందని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఉప్పల్ భగాయత్‌లో శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కమిటి అధ్యక్షుడు బొడ్డుపల్లి రవిప్రశాంత్, ప్రధాన కార్యదర్శి పబ్బోజు బిక్షపతిచారి, కోశాధికారి సూర్యప్రకాష్, ఉపాధ్యక్షుడు చొప్పదండి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యమానికి ముఖ్య అతిధులుగా మల్కాజిగిరి ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ ఎస్.మధుసూధనచారి, సంఘం గౌరవ సలహాదారులు లాలుకోట వెంకటచారి, రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహనచారి, మునుగంటి సతీష్‌కుమార్, మెట్టు సాయికుమార్, ఆచారీ, జూలూరి గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రధాని మోడీ విశ్వకర్మల కోసం ప్రత్యేకంగా పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, ఆర్థికంగా, సామాజికంగా రాణించేందుకు ప్రభుత్వం తగు చేయూత అందిస్తుందన్నారు. విశ్వకర్మ కులస్థులకు ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో భవనం నిర్మించి వారికి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా గణపతి పూజ, అఖండ ప్రతిజ్ఞ, కలశ స్థాపన, ద్వజారోహణం, విశ్వకర్మ భగవానుడికి అభిషేకం, పల్లకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు వెంకటేశ్వర్‌రెడ్డి, తవిడబోయిన గిరిబాబు, పావనీరెడ్డి, పలువురు విశ్వకర్మ సంఘం నేతలు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



1977-79 సంవత్సర పూర్వ విద్యార్థుల దృశ్యం

**రాయపోల్ సెప్టెంబర్22 ప్రభాతవార్త** రాయపోల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1977 నుంచి 79 వరకు చదివిన విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. అప్పట్లో వారికి విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను సాదరంగా ఆహ్వానించారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకొని మధుర జ్ఞాపకాలను తలుచుకుంటూ సంతోషంగా గడిపారు. వారు చదువుకున్న రోజుల్లో కొన్ని జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆనంతరం మృతి చెందిన గురువులు, స్నేహితులకు నివాళులు అర్పిస్తూ మౌనం పాటించారు. కార్యక్రమంలో గురువులు నర్సింహారెడ్డి, కొండల్‌రెడ్డి, మృతుంజయశర్మ, లింగారెడ్డి, వైకుంఠం, మల్లారెడ్డితో పాటు ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

### సిద్దిపేట జిల్లా కేంద్రంలో..

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(మల్టీపర్పస్)లో 2007లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం మోకిడి నరసింహ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాత జ్ఞాపకాలతో తమ అనుభవాలన్ని పంచుకున్నారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. పూర్వ విద్యార్థులు ఆటపాటలతో సంతోషంగా గడిపారు. అనంతరం గురువులు జి.తిరుపతిరెడ్డి, అంజయ్య, జమీర్‌మొయోద్దీన్, నరసింహ్మారెడ్డి, శ్రీనివాస్, ఆశోక్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నాగరాజులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు జి,తిరుపతిరెడ్డి మాట్లాడూత కుల, మతాలకతీతంగా కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ సమాజాభివృద్ధికి, పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. విద్యార్థుల నుంచి యువకులుగా మారిన పూర్వ విద్యార్థులు సమాజంలో మానవ విలువలను పెంపొందించాలన్నారు.

# మధురాపురం 'లడ్డు'నా మజాకా..!

### గణేష్ లడ్డూ 9.31 లక్షలకు దక్కించుకున్న ఎన్. పుల్లారెడ్డి

**షాద్‌నగర్, (ప్రభాతవార్త), (సెప్టెంబరు 22) :** వినాయక నవరాత్రుల ఉత్సవాల్లో లడ్డూ వేలం అంటే అందరికీ ఆసక్తే. చాలామంది నిర్వాహకులు వేలం పాటతో వచ్చిన సొమ్మును మరుసటి సంవత్సరం పండగ నిర్వహణకు ఉపయోగిస్తుంటారు. లేదా సామాజిక సేవా కార్యక్రమాలు, గ్రామాభివృద్ధికి ఖర్చు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇంతింతై వటుడింతై అన్నట్లు ఏడాదికి ఏడాది లక్షల్లోనే విలువ చేస్తున్న మధురాపురం లడ్డు గురించి ఈ ప్రాంతంలో ఆసక్తి ఏర్పడుతుంది. ఇంతకీ మధురాపురం గణేష్ లడ్డు కథేంటో ఈ స్టోరీలో చూద్దామా..!

### మధురాపురమా మజాకా

మధురాపురం గ్రామంలో రెడ్డి సేవా సమితి గణేష్ లడ్డూకు ప్రతి సంవత్సరం లక్షలు వెచ్చించి కైవసం చేసుకుంటున్నారు. గ్రామ మాజీ ఎంపీటీసీ మల్కయ్య గారి భార్గవ్ కుమార్ రెడ్డి (మిన్ను) అందించిన వివరాల ప్రకారం..2024లో గణేష్ లడ్డూ అక్షరాల 9లక్షల 31 వేల రూపాయల ధర పలికింది. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత నంద్యాల పుల్లారెడ్డి ఈ దఫా రెడ్డి సేవాసమితి వేలం పాటలో లడ్డూ దక్కించుకున్నారు. ఈ గ్రామంలో రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో 2011లో గ్రామ మాజీ సర్పంచ్ లక్నాపురం శివారెడ్డి 41,116 రూపాయలకు మొదటి గణేష్ లడ్డూను కైవసం చేసుకున్నారు. ఆ తర్వాత చెన్నారెడ్డి 42,116, ఆ తర్వాత 2013లో అనంత పద్మనాభరెడ్డి 73,116 రూపాయలకు కైవసం చేసుకున్నారు. 2014లో మల్కయ్యగారి గోవర్ధన్ రెడ్డి 35,116, 2015లో సింగిరెడ్డి రంగారెడ్డి 33,116, 2017లో లక్నాపురం అమర్‌నాథ్ రెడ్డి 34,116, 2018లో నంద్యాల పుల్లారెడ్డి 1,05,300లకు లడ్డూను దక్కించుకున్నారు. 2019లో రాజశేఖర్ రెడ్డి 2లక్షల 31,111 వేల రూపాయలకు, 2021లో కనీవినీ ఎరుగని రీతిలో చందా రవీందర్ గుప్త అనే వ్యక్తి ఏకంగా 13లక్షల 62,116 రూపాయలకు మొదటిసారిగా రికార్డు స్థాయిలో లడ్డూను కైవసం చేసుకున్నారు. ఇక ఆ తర్వాత 2022లో మల్కయ్యగారి గోవర్ధన్ రెడ్డి 11లక్షల 16,116 రూపాయలకు, గత సంవత్సరం 2023లో శేరి పర్వత్ రెడ్డి అనే వ్యక్తి 11లక్షల 51,116 రూపాయలకు లడ్డూను దక్కించుకోగా 2024లో నంద్యాల పుల్లారెడ్డి 9లక్షల 31వేలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. ఏడాదికి ఏడాది ఎంతో అభివృద్ధి



లడ్డూను నంద్యాల పుల్లారెడ్డికి అందజేస్తున్న భక్తులు

సాధిస్తున్న మధురాపురం గ్రామంలో సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా పండగలు చేసుకుంటున్నారు. రెడ్డి సేవా సమితి ఒక అడుగు ముందుకేసి గ్రామంలో ఇంత పెద్ద ఎత్తున డబ్బులు వెచ్చించి లడ్డూను కైవసం చేసుకొని, ఆ డబ్బులను సామాజిక ధృక్పథం కోసం వినియోగించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. మధురాపురంలో లడ్డూ బాబుల జోరు.. రెడ్డి సేవా సమితి హోరు అంటూ నియోజకవర్గంలో చర్చ మొదలైంది.

**కలిసికట్టుగా..ఐక్యమత్యంతో కృషి**

మధురాపురం గ్రామంలో ప్రజలు అందరూ కలిసికట్టుగా గ్రామాభివృద్ధికి సామాజిక సేవలకు పాటుపడుతుంటామని ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ మల్కయ్యగారి భార్గవ్ కుమార్ రెడ్డి ప్రభాతవార్తకు తెలిపారు. రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి ఏడాది జరుగుతున్న ఉత్సవాలు అందరికీ ఆదర్శంగా ఉండాలనే ఉద్దేశంతో సంప్రదాయబద్దంగా గణేష్ నవరాత్రుల పండగను నిర్వహిస్తామని తెలిపారు. లక్షలు పెట్టి వేలంపాటలో లడ్డూను కైవసం చేసుకొని సదరు డబ్బులను రెడ్డి సేవా సమితి ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరగుతుందని ఆయన తెలిపారు.

## జోనల్ క్రీడాపోటీల విజేతజట్లు..ఎంపికలు

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్, మేడిపల్లి జోనల్ స్థాయి క్రీడాపోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ఆటతీరును ప్రదర్శించిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు బహుమతులు అందజేశారు. ఘట్‌కేసర్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో రెండు రోజుల పాటు జోనల్ క్రీడలను నిర్వహించారు. కబడ్డీ అండర్-17 బాలికల విభాగంలో మొదటి స్థానంలో ఎంజెపిటి, ద్వితీయ స్థానంలో శ్రీసాయివాణి, బాలుర విభాగం మొదటిస్థానంలో ఎస్‌పిఆర్, ద్వితీయ స్థానంలో అన్నోజీగూడ జడ్పీహెచ్‌ఎస్, కబడ్డీ అండర్-14 బాలికల్లో అవుషాపూర్ ఎంపీయుపిఎస్, ఘట్‌కేసర్ ఎంజెపిటి, బాలుర విభాగంలో ఎస్‌పీఆర్, ఎదులాబాద్ జడ్పీహెచ్‌ఎస్ జట్లు గెలుపొందాయి. వాలీబాల్ అండర్-17 బాలికల్లో ఘట్‌కేసర్ టిఎస్‌డబ్ల్యుఆర్‌ఎస్, ఎదులాబాద్ జడ్పీహెచ్‌ఎస్, బాలురల్లో ఎదులాబాద్ జడ్పీహెచ్‌ఎస్, ఎంజెపిటి బీసీ డబ్ల్యు, అండర్-14లో బాలికల్లో విద్యాజ్యోతి, ఎదులాబాద్ జడ్పీహెచ్‌ఎస్, బాలురల్లో ప్రథమ స్థానం ఎస్‌పీఆర్, ద్వితీయ స్థానంలో ఎంజెపిటి బిసి డబ్ల్యు జట్లు విజేతలుగా నిలిచాయి. జోనల్ కార్యదర్శి శ్రీరాములు విజేత జట్లకు బహుమతులను అందజేసి అభినందించి జిల్లా స్థాయికి ఎంపిక చేశారు.

## కిరాణా కొట్టుకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** టీ కొట్టు నడుపుకుంటూ జీవిస్తున్న వ్యక్తి చక్కర కొనుగోలుకు కిరాణా కొట్టుకు వెళ్లి అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి ఎస్ఐ బి సాయిలు కథనం ప్రకారం... కర్ణాటకలోని ఔరాద్ తాలుకా కొర్రెకల్ తండాకు చెందిన పవర్ ప్రకాష్ 35) రెండు సంవత్సరాల క్రితం ఉపాధి నిమిత్తం నాగల్‌గిద్ద మండల పరిధిలోని ఇరక్‌పల్లి తండాకు చేరుకుని టీ కొట్టు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 10వ తారీఖున చక్కెర కొనుగులుకై వెళ్లిన వ్యక్తి రాత్రికి ఎంతకూ ఇంటికి తిరిగిరాలేదన్నారు. బంధువులు, సన్నిహితుల వద్ద ఆచూకి కోసం గాలించిన ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం అదృశ్యమైన పవర్ ప్రకాష్ భార్య మరణి బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయిలు వివరించారు.

## పారాయణ ముగింపులో పాల్గొన్న ప్రముఖులు

**మునిపల్లి, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ పట్టణంలో నిర్వహించిన శ్రీ సిద్దాంతాసికమణి పారాయణ ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి కర్నాటక మంత్రి ఈశ్వర్ ఖండ్రే, హుమ్నాబాద్ మాజీ ఎమ్మెల్యే రాజశేఖర్ పాటిల్, శ్రీశైల జగద్గురువు డాక్టర్ చిన్న సిద్ధరామ పండితారాధ్య శవాచార్య మహాస్వామి, తెలంగాణ రాష్ట్ర ధర్మ ప్రచార అధ్యక్షులు జగదేవ్ హిరామట్, సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అనిమిశెట్టి జయప్రకాష్, సదాశివపేట వీరశైవలింగ సమాజం ఎడ్ల బజార్ అధ్యక్షులు సిద్దాపురం అరుణ్‌కుమార్, జిల్లా నాయకులు బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పుల్‌కుర్తిలో బుద్ధం శరణం గచ్ఛామి పూజలు

**-పాల్గొన్న గుబ్బపు ఫౌండేషన్ చైర్మన్ మచ్చేందర్**

**మనూర్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పుల్‌కుర్తిలో ఆదివరం బుద్ధం శరణం గచ్ఛామి పూజా కార్యక్రమాలను గ్రామంలోని అంబేద్కర్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు గుబ్బపు మచ్చేందర్ ఫౌండేషన్ చైర్మన్ గుబ్బపు మచ్చేందర్ ముఖ్య అతిథిగా హాజరుకాగా భీం ఆర్మీ అధ్యక్షులు తుకారం, గ్రామస్థులు సాదరంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జీఎంఆర్ ఫౌండేషన సభ్యులు తెలంగాణ రాష్ట్ర ఆత్మ కమిటి డైరెక్టర్ అనుముల మారుతి, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ బాషిత్, నారాయణఖేడ్ మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, నమ్లిమేట్ తాజీ మాజీ సర్పంచ్ సత్యపాల్‌రెడ్డి, నారాయణఖేడ్ మండల తాజా మాజీ జడ్పీటిసి సభ్యులు, ఎస్‌సి ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు రాథోడ్ లక్ష్మీ బాయి రవీందర్ నాయక్, మాజీ నారాయణఖేడ్ మంల బిఆర్ఎస్ అధ్యక్షులు రుద్రార్ తాజీ మాజీ సర్పంచ్ ప్రభాకర్, నాగల్‌గిద్ద మండల మాజీ వైస్ ఎంపిపి అధ్యక్షులు పండరి యాదవ్, కంగ్టి మండల బిఆర్ఎస్ అధ్యక్షులు ఎస్కే గంగారం ముదిరాజ్, ర్యాలమడుగు మాజీ ఎంపిటిసి సభ్యులు అమ్రాన్యనాయక్, కృష్ణాపూర్ తాజా మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, కంగ్టి మండల బిఆర్ఎస్ మాజీ అధ్యక్షులు విశ్వనాథ్, జీఎంఆర్ ఫౌండేషన్ సభ్యులు హర్షవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, పరశురాంరెడ్డి, తుకారం పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు మహిళ మృతి

**న్యాల్‌కల్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** పడుగుపాటుకు గురై మహిళ మృతి చెందిన సంఘటన పోలీసు ఠాణా పరిధిలోని న్యామతాబాద్ గ్రామంలో శనివారం రాత్రికి చోటు చేసుకుంది. ఎస్ఐ రాము నాయుడు కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బూచినెల్లి నాగమ్మ (41) శనివారం వ్యవసాయం చేసుకునేందుకు తనకు చెందిన వ్యవసాయ పొలంకు వెళ్లింది. శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తుండం ప్రారంభం కావడంతో నామమ్మ ఇంటికి పయనమయింది. ఇంటికి వెళుతున్న క్రమంలో 6 గంటల ప్రాంతంలో గ్రామ శివారులో ఎర్రరాయిక్వారి వద్ద పిడుగు పాటుకు గురై అక్కడికి అక్కడే మృతి చెందిందన్నారు. గంగ్వార్ నుంచి న్యామతాబాద్‌కు వస్తున్న ఆటో డ్రైవర్ రోడ్డుపై మహిళ పడి ఉండటాన్ని గమనించి గ్రామస్థులకు సమాచారం అందించగా అందరు వచ్చి చూసే సరికి మహిళ మృతి చెంది ఉందని, మృతి చెందిన మహిళ బూచినెల్లి నాగమ్మగా గుర్తించారు. ఆదివారం మృతురాలి కుమారుడు బూచినెల్లి ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు

**ఉప్పల్, సెప్టెంబరు 22 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం రాఘవ నాట్యమృత కళానికేతన్ నాట్య గురువు శ్రేయస్‌జోషి శిష్య బృందం ఆధ్వర్యంలో భరత నాట్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గణేశగానం, త్రిమాత కౌత్వం, శివస్తుతి, దశావతారం, అన్నమయ్యకృతి, కళింగ నర్తన, అభంగ్ నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఎంతో ఆకట్టుకున్నాయి. కళాకారులు భవానీ, కృతిక, వర్ష, భవ్య, సన్నిధి, శ్రీనిధి, మనస్వి, ఖుషి, అపేక్ష తదితరులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

## అర్హులైన జర్నలిస్టుల వివరాల సేకరణ చేపట్టాలి

### జిల్లా కార్యవర్గ సమావేశంలో నిర్ణయం

**పేట్ బషీరాబాద్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త**

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం యూనియన్ పకడ్బందీగా పనిచేస్తుందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్‌ల సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం సూరారం విఐపి ఫంక్షన్ హాల్లో జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తుందన్న అశాభావం వ్యక్తం చేశారు. మునుపెన్నడూ లేని విధంగా జర్నలిస్టులకు హౌసింగ్ ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం జీవోలు జారీ చేసేందుకు ప్రత్యేక చొరవ చూపిస్తుందని తెలిపారు. ఇది ఎంతో హర్షించదగ్గ విషయమని అన్నారు. ప్రభుత్వం పెద్దలు చూపిస్తున్న మార్గదర్శకం మేరకు సమాజంలో జర్నలిస్టుగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరిని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గ, మండలాల వారిగా సమావేశాలను నిర్వహించి వర్కింగ్ జర్నలిస్టులను గుర్తించాల్సిన బాధ్యత మనపైనే ఉందని తెలిపారు. రానున్న వారం రోజులలో ప్రాంతాలవారీగా సమావేశాలను ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టులను గుర్తించే ప్రక్రియను చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టులను గుర్తించే ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా మొదలైందని స్పష్టం చేశారు. జిల్లాలో సేకరిస్తున్నటువంటి జర్నలిస్టుల వివరాలను మీడియా అకాడమీకి అందజేస్తామని గడ్డమీది బాలరాజు స్పష్టం చేశారు. వచ్చే నెలలో జూనియర్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ముఖ్యమంత్రితో జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతి జర్నలిస్ట్ కృషి చేయాలని కోరారు. యూనియన్లకు అతీతంగా మండలాలు, నియోజకవర్గం వారీగా సీనియార్టీ ప్రతిపాదికతన లిస్టులను తయారు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రాంరెడ్డి, కోశాధికారి బిక్షపతి, ప్రెస్‌క్లబ్‌ల అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వనదుర్గమ్మను దర్శించుకున్న భక్తజనులు

**పాపన్నపేట, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** భక్తుల కోరికలు తీర్చే కొంగుబంగారు తల్లిగా విరాజిల్లుతున్న ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయ ఆదివారం భక్తులతో సందడిగా మారింది. ఆయా ప్రాంతాల నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులు తమ మొక్కుబడిలో భాగంగా అమ్మవారికి తలనీలాలు సమర్పించి మంజీర పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి బోనాలతో ఊరేగింపుగా చేరుకుని బోనాలు, ఒడిబియ్యం సమర్పించి కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు అమ్మవారి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆలయ ఈఓ చంద్రశేఖర్, సిబ్బంది రవివీర్ కుమార్, సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, నర్సింలు, వరుణాచారి, భత్తిని రాజు, యాదగిరి, శ్రీకాంత్ తదితరులు తగు ఏర్పాట్లు చేశారు. ఆలయానికి చేరుకున్న భక్తులు ఆలయ అర్చకులు శంకర శర్మ, పార్థివ శర్మ, మురళీధర్, రాజశేఖర్‌లు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తన సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశారు.

## తెలంగాణ వ్యాప్తంగా విజిఎల్ఎస్ హెల్త్‌కేర్ సేవలు అమలు

### ప్రతి ఒక్కరికి డిజిటల్ హెల్త్ ఐడి రిజిస్ట్రేషన్లు నమోదు

**ఉప్పల్, సెప్టెంబరు 22 ప్రభాతవార్త :** వహ్నిజా గ్లోబల్ లైఫ్ సైన్స్‌స్ కంపెనీ డిజిటలైజేషన్ ఫర్ హెల్త్ కేర్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం రామంతాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. విజిఎల్ఎస్ హెల్త్ కేర్ రంగంలో డిజిటలైజేషన్ సర్వీసెస్ కల్పించేందుకు పీఆర్జినిక్స్ టెక్ సహకారంతో దక్షిణ భారతదేశంలోని తెలంగాణలో తమ కార్యకలాపాలను ప్రారంభించినట్లు సంస్థ నిర్వహకులు డా.ఐ.ప్రియదర్శిని తెలిపారు. ఆరోగ్య రంగంలో డిజిటల్ సర్వీసెస్ ప్రవేశపెట్టే ఎన్నో కంపెనీలు ఉండగా ఒకే దగ్గర అన్ని రకాల సేవలు అందించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందని ఆమె తెలిపారు. ఎయిమ్స్ డిప్యూటి సూపరిడెంట్ డా.యదుకుల్ మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో డిజిటలైజేషన్ ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరికి హెల్త్ ఐడి ఉండాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఎబిడిఎమ్ చర్యలు, డిజిటల్ ఐడి ఉండడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ఐఐహెచ్‌పి అధ్యక్షుడు డా.ఎం.ఎన్.రాజు మాట్లాడుతూ నేటి ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్ కాలంలో మార్పుతోపాటు మార్పు అందుకోవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌జెనిక్స్ సిఈవో వినోద్, సోమసుందర్‌శర్మ, వహ్నిజా గ్లోబల్ లైఫ్ సైన్స్‌స్ కంపెనీ అధినేత డా.ఐ.ప్రియదర్శిని పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థులకు రెడ్డి సంఘం నేతలు చేయూత

**ఉప్పల్, సెప్టెంబరు 22 ప్రభాతవార్త :** స్వర్గీయ కెప్టెన్ వీరరాజిరెడ్డి జయంతి సందర్భంగా రామంతాపూర్ రెడ్డి సంఘం భవనంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రామంతాపూర్ రెడ్డి సంఘం అధ్యక్షుడు పసుల ప్రభాకర్‌రెడ్డి, తడిసిన సురేందర్‌రెడ్డి, మాధవరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, కాంతాల నారాయణరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు ప్రమీలారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రామంతాపూర్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు తమ వంతు చేయూత అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. సమాజానికి తమ వంతు సలహాకారం అందించేందుకు తన వంతు పాటుపడుతున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం నేతలు రావి నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

**సంజీవ్‌రెడ్డి నగర్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త**

లెనోవా నీలిమ హాస్పిటల్లో చికిత్స పొందుతూ ఓ యువకుడు అనుమానాస్పద స్థితిల మృతి చెందిన సంఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సనత్‌నగర్ ఇన్స్‌పెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం సనత్‌నగర్ డివిజన్ ఎస్ఆర్‌టీ కాలనీకి చెందిన అఫ్నాన్ బిన్ హుస్సేన్ (20) జ్వరంతో శుక్రవారం నాడు సనత్‌నగర్‌లోని లెనోవా నీలిమా ఆసుపత్రిలో చేరాడు. శనివారం రాత్రి 9 గంటల సమయంలో చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. కాగా వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని బంధువులు ఆందోళన చెంది సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించినట్లు ఇన్స్‌పెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు.

## కేదారి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే తలసాని

**సంజీవ్‌రెడ్డి నగర్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త**

కార్మికుల హక్కుల కోసం, ప్రజా సమస్యల పరిష్కారానికి గంజి కేదారి ఎంతో కృషి చేశారని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లోని నెహ్రూనగర్ అధ్యక్షులు గంజి కేదారి శనివారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదివారం సనత్‌నగర్‌లోని రాజరాజేశ్వరి నగర్‌లోని వారి నివాసానికి వెళ్లి కేదారి పార్థీవదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా, కాలనీ అధ్యక్షుడిగా, పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా ఎనలేని సేవలు అందించారని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, నాయకులు సురేష్‌గౌడ్, రాజేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి అండగా ఉంటాం

**సంజీవ్‌రెడ్డి నగర్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త**

మృతుని కుటుంబానికి అండగా ఉంటామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హామీ ఇచ్చారు. సనత్‌నగర్‌లోని ఎస్ఆర్‌టికి చెందిన హుస్సేన్ కుమారుడు అఫ్నాన్ (20) శనివారం సాయంత్రం మరణించాడు. విషయం తెలుసుకునన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ వారి నివాసానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమ కుమారుడు జ్వరంతో బాధపడుతుంటే స్థానికంగా ఉన్న ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లామని అఫ్నాన్ తండ్రి హుస్సేన్, ఇతర కుటుంబ సభ్యులు వివరించారు. చికిత్స ప్రారంభించిన కొద్దిసేపటికే మరణించారని తెలిపారు. తమ కుమారుడికి అందించిన వైద్యం, మృతిపై అనుమానాలు ఉన్నాయని వారు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే సనత్‌నగర్ సిఐతో ఫోన్‌లో మాట్లాడి పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కొలన్ బాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్, రాజేస్, ఖలీల్, నోమాన్, జమీర్‌లు పాల్గొన్నారు.

## నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలి

**రాష్ట్ర ముదిరాజ్ హక్కుల సాధన సమితి అధ్యక్షులు : శ్రీనివాస్**

బెజ్జంకి, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త : మండల కేంద్రంలోని చేపల పెంపకందారుడు అక్కరవేణి పోచయ్యకు చెందిన చేపల చెరువులో విషపూరితమైన మందులు కలిపి నష్టం కలిగించే వారిని పోలీసులు గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముదిరాజ్ హక్కుల సాధన సమితి అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం ముదిరాజ్ సంఘం నాయకులు బాధితుడు అక్కవరేణి పోచయ్యను పరామర్శించి సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ముదిరాజ్‌లపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. ముదిరాజ్ సంపదలపై దాడులు జరుగుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. చేపల మృతిపై సమగ్ర విచారణ చేపట్టి నిందితులను శిక్షించాలన్నారు. ఆయన వెంట రావుల మొండయ్య, అన్నాడి సత్యనారాయణరెడ్డి, మల్లేశంగౌడ్, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

# రెండు లక్షలకు పైగా ఉన్నబాఖీని చెల్లించిన రైతు

## గాలిలో దీపంలా రైతుల రుణమాఫీ పరిస్థితి

**సంగారెడ్డిబ్యూరో సెప్టెంబరు 22,ప్రభాతవార్త:**

తమ పరిస్థితి గాలిలో దీపంలా మారిందని రెండులక్షలకుపై వ్యవసాయ రుణంతీసుకొని,మాఫీకి నోచుకొని జిల్లాలోని వివిధ మండలాల రైతులు అందోళన వ్యక్తం చేస్తూన్నారు. ఆగస్టు15లోగా రైతులకు రెండులక్షల రుణమాఫీ చేస్తామని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటిచారని, పార్లమెంట్ ఎన్నికలలలో,ఎన్నికల ప్రచారంలో రుణమాఫీచేస్తామని దేవుళ్ళపై ఒట్లువేసి సిఎం రేవంత్‌రెడ్డి మరీ చెప్పారని కాని,రెండులక్షలపైగా రుణంఉన్న రైతుల గురించి పట్టించుకోవడంలేదని వివిద గ్రామాల రైతుల ఆరోపిస్తున్నారు.సంగారెడ్డిజిల్లాలో ఎంతమంది రైతులకు రెండులక్షల రుణమాఫీ కావలసిఉందో కూడ, అదికారుల వద్ద వివరాలులేని పరిస్థితి నెలకొంది.రెండులక్షలకు పైగా ఉన్న రుణం ఎప్పుడు మాఫీఅవుతుందో కూడ స్పష్టంగా చెప్పలేని పరిస్థితి నెలకొంది.రెండులక్షలకు పైగా రుణంతీసుకున్న రైతుల మాఫీపై మంత్రి వర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం ప్రకటిస్తామని ఇటివల విలేకరుల సమావేశంలో రాష్ట్రవ్యవసాయ మంత్రి తుమ్మలనాగేశ్వర్‌రావు చెప్పారని,.ఈనెల 20న, రాష్ట్రమంత్రివర్గం సమావేశం జరిగింది. అందులో రుణమాఫీపై ఏలాంటి స్పష్టత ఇవ్వలేదని రైతులు వాపోతున్నారు. తెలంగాణ రాష్ట్రసచివాలయం ఆవరణలో, రాజీవ్‌గాంధీ విగ్రహ ఆవిష్కరణ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రెండులక్షలకుపైగా రుణం ఉన్న రైతుల,రెండులక్షలు పోగా మిగితాతి చెల్లిస్తే తక్షణమే రైతుల ఖాతాలలో డబ్బులు వేస్తామని ప్రకటించారని.ఇదే సంబర్భంలో కొందరు రైతులు రెండులక్షలు పోగా మిగితాది, బ్యాంకులలో చెల్లించారు.అయిన తమఖాతాలలో ఒక్కరుపాయి కూడ రుణమాఫీ డబ్బులు రాలేదని పలువురు రైతులు తెలిపారు. అసలు ప్రభుత్వంకు రెండులక్షలపై రుణం ఉన్న వారికి బాకీచెల్లించే ఉద్దేశ్యం ఉందా అనుమానం కలుగుతుందని పలువురు రైతులు అందోళన వ్యక్తం చేస్తూన్నారు.రాష్ట్రముఖ్యమంత్రి చెప్పిన మాటకు,రాష్ట్ర వ్యవసాయ మంత్రి చెప్పిన ప్రకటనలు ఆమలుకు నోచుకోకుండా పోయాయని రైతులు ఆరోపిస్తున్నారు.ఇద్దరి మాటలే ఆమలుకు నోచుకోకుంటే ఇంకెవరు నిర్ణయం తీసుకుంటారని రైతుల ప్రశ్నిస్తున్నారు.రుణమాఫీకి ప్రభుత్వం నిర్ణీత గడువు పెట్టింది దీని ప్రకారం 2018 డిసెంబరు 12నుండి 2023డిసెంబరు9వదేది వరకు బ్యాంకు రుణాలు తీసుకున్న రైతులందరికి రుణమాఫీ చేస్తామని ప్రకటించారు.సంగారెడ్డి.జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం98239మంది రైతులకు,849.34 కోట్లు రుణమాఫీ జరిగింది. కాని ఇంకా ఎంత మందికి రుణమాఫీ కావలసిఉందనే వివరాలు ప్రభుత్వం ఇప్పటికి అందుబాటులో ఉంచలేదు. స్థానిక సంస్థల ఎన్నికల వరకు రెండు లక్షల పైగా ఉన్న రుణమాఫీపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవచ్చని పలువురు రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్‌ను వివరణ కోరగా రుణమాఫీ అయిన రైతుల వివరాలు మాత్రమే తమ వద్ద ఉన్నాయని,రుణమాఫీ కావలసిన రైతుల వివరాలు తమవద్దలేవని అన్నారు.